స్ఫూర్తిప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ

సాక్షినెట్‌వర్క్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి శుక్రవారం జిల్లా వ్యాప్తగా కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ పీవీ రమేష్, తదితరులు స్థానిక కార్యాలయం ఎదుట నివాళి అర్పించారు.

■ జడ్చర్లలో మిషన్‌భగీరథ ఈఈ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజయ్య తదితరులు నివాళి అర్పించారు.

■ భూత్పూర్ పట్టణంలో వైద్యాధికారి అబ్దుల్ రబ్, జహీరోద్దీన్, సూపర్‌వైజర్లు సుధాకర్, భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

■ మూసాపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీవో అనురాధ తదితరులు పాల్గొన్నారు.

■ అదేవిధంగా రాజాపూర్, చిన్నచింతకుంట, గండీడ్, దేవరకద్రలో కార్యక్రమాలు నిర్వహించారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, వైస్ చైర్మన్ విజయ్ కుమార్, సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, కాంగ్రెస్‌నాయకులు

పీయూలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రత్యేక తెలంగాణ కోసం 50 సంవత్సరాల పాటు కొండాలక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పీయూలో ఆయన జయంతి కార్యక్రమం నిర్వహించారు. కీ నోట్ స్పీకర్ భూమయ్య, బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ల చంద్రకిరణ్, నూర్జహాన్, బషీర్ అహ్మద్, కంట్రోలర్ రాజ్‌కుమార్, శాంతిప్రియ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



పీయూలో..



జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో..

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని.. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తెలిపారు. శుక్రవారం మహమ్మదాబాద్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. వసతులను పరిశీలించారు. మరుగుదొడ్ల నిరుపయోగంపై ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా విద్యాధికారి రవీందర్, ఎంఈఓ రాజునాయక్, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వృద్ధులకు అండగా ప్రభుత్వం

మహబూబ్‌నగర్ రూరల్: వృద్ధులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా స్టేడియం గ్రౌండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు వాక్ థాన్ ర్యాలీ నిర్వహించారు. డీడబ్ల్యూఓ జరీనాబేగం, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు



కోయిల్‌కొండ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల కోసం లబ్ధిదారుల దగ్గర డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండలంలో అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. 180 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులను ఎవరైనా డబ్బులు అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ కాళప్ప, సూపర్‌డెంట్ హరిశ్చంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, మండల అధ్యక్షుడు జి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల బుక్‌లెట్ విడుదల



జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించే దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల బుక్‌లెట్‌ను ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పాలాది రామ్మోహన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన సంఘ అధ్యక్షుడు గుండ నరేష్, కొత్త మధు, దాచేపల్లి చంద్రయ్య, ప్రభు, మేడిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



భూత్పూర్: అంగన్‌వాడీల్లో ఇచ్చే పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీం సుల్తానా అన్నారు. పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. శుక్రవారం తాటిపర్తి, కొత్తూర్ గ్రామాల్లో పోషణ మహోత్సవంలో భాగంగా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు మంజుల, యాదమ్మ, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది



గండీడ్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. పెద్దవార్వాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, ఇంచార్జీ ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, డీటీ మాధవి, ఆర్ఐ ఫయాజ్, యాసీన్, కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిన్నయ్య, ఆశన్న, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిధి ఆప్కే నికత్‌తో ప్రయోజనంలేదు



చిన్నచింతకుంట: నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమంతో బీడీ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఎస్ దేవదానం అన్నారు. పేట జిల్లా అధికారులు శుక్రవారం చిన్నచింతకుంటలో నిర్వహించిన కార్యక్రమాన్ని బీడీ కార్మికుల నాయకులతో కలిసి బహిష్కరించారు. అధికారి సుందర్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. దేవదానం మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కార్యక్రమం చేపట్టారన్నారు. ఈమేరకు అధికారులు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సి ఉందన్నారు. కానీ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ప్రయోజనం లేని కార్యక్రమం ఎందుకని మండిపడ్డారు. అందుకే బహిష్కరించామని తెలిపారు. ఐఎఫ్‌టీయూ నాయకులు కొండన్న, అరుణ్‌కుమార్, వెంకటన్న, చంద్రన్న, యాదమ్మ, జయమ్మ, పద్మమ్మ, గోపాల్, రవి పాల్గొన్నారు.

హిందీపై వర్క్‌షాప్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం హిందీ భాషపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రారంభించిన ప్రిన్సిపాల్ డా. సుకన్య మాట్లాడుతూ భాషా సాహిత్యంపై పట్టు సాధించాలన్నారు. హిందీ విభాగం అధిపతి డా.నర్సింహ్మారావు కల్యాణి, కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రీసోర్స్‌పర్సన్ డా.వివేక్‌కుమార్ దూబె, అధ్యాపకులు డా. నర్మద, కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ డా.శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల హక్కులు కాపాడదాం



నవాబుపేట: సీనియర్ సిటిజన్‌ల హక్కులు కాపాడటం అందరి బాధ్యత అని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్ ఫోరంను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎన్నుకున్నారు. తహసీల్దార్ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో ఎంపీడీఓతో పాటు ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. అలాగే ఫోరంను గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్న నవాబుపేటకు చెందిన నర్సింహులు, వెంకటేశ్వరప్పలను సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. అనంతరం సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు.ఎస్ఐ విక్రమ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజరాజేశ్వరీ, ఈఓపీఆర్డీ బద్రునాయక్, పారిజాత, రత్నమాలా, ఆర్ఐ కిరణ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి– ఆదర్శనగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటున్న ఇందిర, కేశవులు కుటుంబంపై రెండు నెలల క్రితం బిహార్‌కు చెందిన వ్యక్తి యాసిడ్ దాడి చేయడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. ముగ్గురి సర్జరీకి సహకారం అందిస్తామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అలాగే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ రూరల్ ఎస్ఐని ఆదేశించారు. అనంతరం కేశవులు కుటుంబానికి కాంగ్రెస్ కార్యకర్తలు నిత్యావసర సరుకులను అందజేశారు. చౌదర్‌పల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దర్పల్లి మన్యం మృతిచెందగా ఎమ్మెల్యే ఆదేశానుసారం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం చేశారు.

నీటి సరఫరా సమస్యకు చెక్ పెట్టాలి

జడ్చర్ల టౌన్: గ్రామాల్లో తలెత్తుతున్న చిన్న చిన్న సమస్యలను అప్పటికపుడు పరిష్కరించి మంచి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చెక్‌పెట్టాలని.. వాటర్‌మేన్‌లకు మిషన్‌భగీరథ ఈఈ పుల్లారెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నాలుగురోజులుగా కొనసాగుతున్న శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన సందర్శించి ప్రసంగించారు. శిక్షణ వినియోగించుకుని సింగిల్‌ఫేస్, త్రిఫేస్ మోటార్లు చెడిపోతే అప్పటికపుడు మరమ్మతు చేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు అయితే వాటిని మరమ్మతు చేయటంతో పాటు కొత్తపైప్‌లైన్ వేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్‌లు ఇచ్చిన శిక్షణతో సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఎప్పటికపుడు నీటి ట్యాంకులు శుభ్రం చేయటం, క్లోరినేషన్ సక్రమంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని వారికి సూచించారు. శిక్షణ పొందిన వారంతా సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 550 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. మొదటి విడతగా జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్, మహబూబ్‌నగర్ మండలాల్లో శిక్షణ ముగిసిందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ పుల్లారెడ్డి

రైతుల కోసమే సహకార వ్యవస్థ

దేవరకద్ర: రైతుల కోసమే సహకార వ్యవస్థ ఉందని సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. రైతులకు అన్ని విధాల సేవలు అందించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్‌ఆర్‌పీ ధరలకే ఎరువులు, విత్తనాలను రైతులకు అందిస్తున్నామని అలాగే పంటలకు వాడే క్రిమిసంహారక మందులను త్వరలో అందిస్తామన్నారు. సహకార వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రయత్నిస్తున్నామని దీనికి రైతులు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా వస్తున్న రుణమాఫీలలో పేర్లు లేని వారి జాబితాలను మళ్లీ అధికారులకు పంపించినట్లు వివరించారు. రైతులు పాత బకాయిలు చెల్లించి సంఘం బలోపేతానికి సహకరించాలని కోరారు. రుణాలను ఎప్పటి కప్పుడు రెన్యూవల్ చేయించుకోవాలని దీని వల్ల అపరాధ వడ్డీ పడదని తెలిపారు. జిల్లా బ్యాంకు ద్వార వివిధ పథకాల కింద రుణాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సహకార సంఘానికి నూతన భవనం, షాపింగ్ కాంప్లెక్స్, గోదాముల నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలను చదివి సభలో ఆమోదించారు. సమావేశంలో జిల్లా అధికారి దివ్య, పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాసులు, డైరెక్టర్లు ఎక్బాల్‌పాష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

బస్టాండులో 'స్వచ్ఛత హీ సేవ'



సేకరించిన చెత్త, వ్యర్థాలను సంచిలో వేస్తున్న మెప్మా ఆర్‌పీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు ఆవరణలో శుక్రవారం 'స్వచ్ఛత హీ సేవ' చేపట్టారు. ఇందులో భాగంగా 1.5 టన్నుల చెత్తను సేకరించడమే గాక పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్, మెప్మా సీఓలు ఆంజనేయులు, నిర్మల, వరలక్ష్మితో పాటు ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మరో 200 మందికి వైద్య పరీక్షలు

కాగా, మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని కళాభారతి ప్రాంగణంలో రెండోరోజు మరో 200 పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

బాధ్యతల స్వీకరణ

దేవరకద్ర: మండల విద్యాధికారిగా బలరాం శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. బలరాం గతంలోనూ ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహించారు. తాజాగా మండలానికి వచ్చిన ఆయనను పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

గాంధీజీ సిద్ధాంతాలు సమాజానికి అవసరం

స్టేషన్ మహబూబ్‌నగర్: నేటి సమాజానికి గాంధీజీ సిద్ధాంతాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2 నుంచి 100 రోజులపాటు 1000 కిలోమీటర్లు గాంధీజీ సిద్ధాంతాలను ప్రచారం చేయుటకు.. డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్ చేపట్టనున్న పాదయాత్ర కరపత్రాన్ని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జగపతిరావు, రాజసింహుడు పాల్గొన్నారు.

అధికారులు విధిగా హాజరుకావాలి

భూత్పూర్: మూసాపేట మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు. అధికారులు సకాలంలో అందుబాటులో ఉండాలని, గైర్హాజరైన అధికారుల వివరాలు కలెక్టర్‌కు సమాచారం నిమిత్తం తెలియజేస్తామని వివరించారు.

జడ్చర్ల టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి ఇకపై ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఉంటుందని.. ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలియజేశారు.

పౌష్టికాహారం అందించాలి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో గుడ్లు సరఫరా చేయటం లేదని వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ విద్యార్థులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం చంద్రకళను గుడ్లు, చిక్కీలు విద్యార్థులకు ఎందుకు ఇవ్వటం లేదని అడిగారు. కాగా కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రానందున సెప్టెంబర్‌లో సరఫరా చేయలేదని.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆమె బదులిచ్చారు. కాగాఈ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్, తదితరులు ఆమెను కోరారు.

జడ్చర్లలో కుక్కల స్వైరవిహారం



జడ్చర్ల: పట్టణంలో వీధి కుక్కలు శుక్రవారం స్వైర విహారం చేశాయి.సాయినగర్, సరస్వతీ కాలనీ, శ్రీ వెంకటేశ్వర తదితర కాలనీలలో గుంపులు గుంపులుగా రోడ్లపైకి రావడంతో స్థానికులు ఆందోళనలకు గురయ్యారు. కొందరైతే బయటకు వెళ్లే సమయంలో కర్రలు చేతిలో పట్టుకుని బయలు దేరారు. గుంపులు గుంపులుగా ఉన్న కుక్కల మందల ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కుక్కల బెడద నుండి తమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

పాలమూరులో డ్రై డే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని మొత్తం 49 వార్డులలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగారు. ఆవరణలోని తొట్లు, సంప్‌లను పరిశీలించి నిల్వ నీటిని పారబోయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులతో వీధుల్లో మోరీలు, రోడ్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి, రసాయనాలు పిచికారీ చేయించారు. దోమల నివారణకు గాను వివిధ వార్డుల్లో ఫాగింగ్ చేపట్టారు.

జడ్చర్లలో..

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరుగుతున్న డ్రైడేను కమిషనర్ ఎస్.రాజయ్య పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేయటంతోపాటు ప్రజలతో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు



దేవరకద్ర: మండల కేంద్రంలో నిర్మించిన ఆర్వోబీకి ఇరు వైపుల సర్వీసు రోడ్ల నిర్మాణం కోసం అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించే పనులు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులు ప్రారంభించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

దేవరకద్ర: మండలానికి శుక్రవారం ఇద్దరు కొత్త అధికారులు వచ్చి పదవీ బాధ్యతలు తీసుకున్నారు. తహసీల్దార్‌గా చిన్నచింతకుంట నుంచి బదిలీ పై వచ్చిన కృష్ణయ్య విధుల్లో జాయిన్ అయ్యారు. పలువురు అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. దీపిక, శరత్, అంజిల్‌రెడ్డి, కోన రాజశేఖర్, రాజుగౌడ్, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు

దేవరకద్ర: గద్దెగూడెంలో శుక్రవారం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయానికి అందరు సహకరించాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కృష్ణంరాజు, నారాయణరెడ్డి, దామోదర్, అనిల్, మహేశ్, రాము, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని పౌష్టికాహారం



హన్వాడ ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

● పాఠశాలల్లో గుడ్డుకు బదులు అరటిపండ్ల అందజేత

హన్వాడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు వారంలో మూడు రోజులు విద్యార్థులకు గుడ్డు తదితరాలు ఇవ్వాల్సి ఉండగా.. ఏ మాత్రం అందజేయకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. మెనూను పాటించడం లేదు. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్డు ఇవ్వాల్సి ఉండగా వాటి బదులు అరటిపండ్లను ఇస్తున్నట్లు బాహాటంగా చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారికి గుడ్డు ధరలు కొండెక్కాయని, ధరాభారంతో ఇవ్వలేకపోతున్నామని అంటున్నారు. కాగా శుక్రవారం 'సాక్షి' మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు సల్లోనిపల్లి పాఠశాలలను సందర్శించగా విషయం వెలుగులోకి వచ్చింది. మండల వ్యాప్తంగా ఉన్న మొత్తం 64 పాఠశాలల్లోని వంట ఏజెన్సీల వారందరూ ఇదే పద్ధతిని అవలంభిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా ఇలా అయితే విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా అందుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటున్నారు.

ధరలు అధికమవడంతో..



ఇటీవల గుడ్ల ధరలు అధికమయ్యాయి. దీంతో విద్యార్థులకు ఇవ్వలేకపోతున్నాం. అధిక ధరల కారణంగా గుడ్డుకు బదులుగా అరటిపండు ఇస్తున్నాం. వారంలో మూడు రోజులు గుడ్డు ఇవ్వాల్సి ఉండగా ఒకరోజు కుదించి ఇస్తున్నాం. ఒక గుడ్డు ధర మార్కెట్‌లో రూ.6 ఉంది . ప్రభుత్వం మాత్రం మాకు రూ. 4 మాత్రమే ఇస్తుంది. మిగతా రూ. 2 భారంగా మారింది.

– అమృతమ్మ, హన్వాడ పీఎస్, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

నిబంధనలు పాటించాల్సిందే



వారంలో మూడు రోజులు వంట ఏజెన్సీల వారు విద్యార్థులకు గుడ్డు ఇవ్వాల్సిందే. మినహాయింపు అనేది ఉండదు. దీనిపై మాకు సమాచారం లేదు. ఎవరైనా ఇలా వ్యవహరిస్తే వారు ఏజెన్సీ నుంచి తప్పుకోవచ్చు. మెనూ అమలు చేయాల్సిందే. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– గోపాల్‌నాయక్, ఎంఈఓ, హన్వాడ.

త్రీడీ ప్రదర్శన

నవాబుపేట: చిన్నారులకు భూమి తదితర వాటిపై అవగాహన కల్పించేలా నిర్వహించిన ప్రత్యేక త్రీడీ చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది. అఖిల ఇన్నోవేషన్ ప్లానిటోరియం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. చాణుక్య పాఠశాల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నిర్వాహకుడు రఘువెంకట సూర్యకుమార్ పాల్గొన్నారు.